క్లుప్తంగా

డిజిటల్ బోధనపై అవగాహన



డిజిటల్ విధానంలో బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని కాగాం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థుల చేతిరాతలు, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లానింగ్, జగనన్న గోరుముద్ద పథకం అమలుతీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో డిజిటల్ విద్య బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు.

ఆయుర్వేదంతో ఉత్తమ ఫలితాలు



వైద్యతనిఖీలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆయుర్వేద మందులను వినియోగించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. ఖండ్యాం గ్రామంలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 52 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద మందులు వినియోగించడం వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ ఉండవన్నారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ, ఏఎన్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



గజరాయునివలస ఆర్‌బీకేలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: మండలంలో ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులంతా విధిగా ఈకేవైసీ కూడా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష కోరారు. మండలంలోని గజరాయునివలస, గొల్లాది గ్రామాల్లో చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ–క్రాప్ చేసిన రైతులతో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని, అప్పుడే రైతులకు రాయితీలు, పంటబీమా సౌకర్యం, సున్నవడ్డీ, మద్దతుధర వంటి ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈకేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 9వ తేదీవరకు గడువు ఉన్నందున రైతులు సమీపంలోని ఆర్‌బీకేల్లో వీఏఏలను కలిసి ఈకేవైసీ పూర్తిచేసుకోవాలని కోరారు.

కొత్త తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాలి



ఐసీఆర్‌పీలకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీ

రాజాం: రైతులకు బయోకల్చర్స్ తెగుళ్లపై అవగాహన కల్పించాల్సి ఉందని ప్రకృతి వ్యవసాయం ఎస్‌ఎఫ్ రేఖ, మాస్టర్ ట్రైనీ కిరణ్ అన్నారు. మండలంలో గార్రాజుచీపురుపల్లి యూనిట్ పరిధి బొద్దాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా జరుగుతున్న విపత్తును, కొత్తగా పుట్టుకొస్తున్న తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

తెర్లాం: మండలంలోని నందబలగ, నందిగాం గ్రామాల్లో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, పీఆర్ ఏఈ ఆర్నిపల్లి రాజశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందబలగలో ఉదయం 10.30గంటలకు, నందిగాంలో 11.30గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా..

- అన్ని గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- ప్రజల నుంచి విశేష స్పందన

ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్య సర్వే నిర్వహించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తోంది. బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లోని పలు పంచాయతీల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి యూపీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రారంభించారు. రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు అందజేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: గొల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రేగిడి: సోమరాజుపేటలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు



సంతకవిటి: రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



బాడంగి: గూడెపువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వంగర: కొప్పరవలసలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ



రాజాం: శ్యాంపురంలో ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ నరేంద్ర



రామభద్రపురం: కొట్టక్కి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి



మెంటాడ: రోగులకు మందులను అందిస్తున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు



తెర్లాం: తెర్లాం సచివాలయం-2 వద్ద నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్, సర్పంచ్ రూప

ఆరోగ్య సర్వే సక్రమంగా చేపట్టాలి

రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని సోపేరు, గార్రాజుచీపురుపల్లి గ్రామాల్లో శుక్రవారం సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. వలంటీర్లు వారికి కేటాయించిన క్లస్టర్ల పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అందించే వైద్య సేవలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



గార్రాజుచీపురుపల్లిలో సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

విక్రాంత్‌కు సత్కారం

రాజాం: శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అభినందించారు. రాజాంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం విక్రాంత్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పేరాడ తిలక్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు మూకాల కస్తూరీ, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, డాక్టర్ తలే రాజేష్, కంబాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



విక్రాంత్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

మోతాదుకు మించి వాడొద్దు

రేగిడి: పంటలకు అధిక మోతాదులో రసాయన ఎరువులను వాడొద్దని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి, ఉంగరాడ, సోమరాజుపేట, చాటాయవలస తదితర గ్రామాల్లో ఈ–క్రాప్ బుకింగ్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి పంటకు మోతాదుకు మించి రసాయన ఎరువులు వేస్తే చీడపీడలు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతీ రైతు ఈ–క్రాప్ బుకింగ్‌ను విధిగా చేయించుకోవాలన్నారు. దీని వలన రైతుభరోసా కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు.

నారాయణ సేవ



గర్భిణులకు భోజనాలు అందజేస్తున్న సత్యసాయి భక్తులు

రేగిడి: వైద్య సేవల కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు, గర్భిణులకు సత్యసాయి భజన మండలి సభ్యులు శుక్రవారం భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారు 70 మందికి భోజనాలు అందజేసినట్లు భజన మండలి సభ్యులు తెలిపారు. వైద్యాధికారి అసిరినాయుడు, వెటర్నరీ డాక్టర్ దుర్గాప్రసాద్, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, భూదేవి, విష్ణుమూర్తి, కరణం రామకష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఈ నారాయణ సేవా కార్యక్రమం నిర్వహించారు.

గణనాథునికి సామూహిక హారతి

బొబ్బిలి: మండలంలోని మెట్టవలసలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ మండపంలో శుక్రవారం సాయంత్రం సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. సమరసతా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారకులు ధూపం వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. గీతాలాపన చేస్తూ స్వామివారికి హారతిచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన

- 5 రోజుల్లో 2144 మందికి వైద్య సేవలు

రామభద్రపురం: మండలంలో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని వైద్యాధికారులు పి.దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష, బి.రత్నదీపక్, షారుక్, హారిక, ఆర్.సునీత అన్నారు. కొట్టక్కిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద శుక్రవారం వారు మాట్లాడుతూ..సెప్టెంబరు 30 నుంచి ఈనెల 6 వరకు 5 రోజుల పాటు మండలంలో నిర్వహించిన వైద్య శిబిరాలలో 2,144 మంది రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 450 మందికి కంటి పరీక్షలు, 410 మందికి బీపీ, 345 మందికి సుగర్, 30 మందికి ఈసీజీ పరీక్షలు చేశామన్నారు. 39 మంది రోగులకు మెరుగైన వైద్య సేవల కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

బొబ్బిలి: బీజేపీ నేతల తీరు సరికాదని పీసీసీ సభ్యుడు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాహుల్ గాంధీని రావణుడిగా చిత్రీకరించడం దారుణమన్నారు. బీజేపీ నేతలు తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



వంగర: కె.కొత్తవలస పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ దుర్గారావు



రేగిడి: బూరాడ యూపీ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

వంగర: పాఠశాల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. మండలంలోని కె.కొత్తవలస, కొండచాకరాపల్లి ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు వివరించాలని, అందకోసం ప్రతీ నెల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు యడ్ల జనార్దనరావు, నాగరాజు, కంటు అప్పలనాయుడు పాల్గొన్నారు.

- రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని బూరాడ, సోమరాజుపేట, లక్ష్మీపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లోన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మానసిక సామర్థ్యాలను అంచనా వేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు అధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.అప్పలరాముడు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, సీఆర్‌పీ కెంబూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గట్టు పంటల సాగుతో ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్

రేగిడి: గట్టు పంటలతో పొలంలో పండించే ప్రధాన పంటలకు చీడపీడల వ్యాప్తిని నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో సోమరాజుపేట గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలం గట్లుపై తీగజాతి ఆకుకూరలు, కాయగూర మొక్కలు సాగు చేయడం వల్ల ప్రధాన పంటలకు తెగుళ్లు, పురుగులు చేరవన్నారు. అలాగే ఇంటికి కావాల్సిన కూరగాయలను మనమే సాగు చేసుకోవడం ద్వారా కుటుంబ ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు లక్ష్మునాయుడు, వరలక్ష్మి, నారాయణరావు పాల్గొన్నారు.

వంతెనను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: పారాది వంతెన మరమ్మతులను త్వరగా చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ వంతెనను శుక్రవారం వారు పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జయశ్రీ, ఈఈ జీవీ రమణ, శంబంగి వేణుగోపాలనాయుడు వంతెన ప్రస్తుత పరిస్థితిని వారికి వివరించారు. కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుతో పాటు టెండరు ప్రక్రియ కూడా పూర్తయిందని, కిందన ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేసిన వెంటనే కొత్త వంతెన పనులు ప్రారంభిస్తామని అధికారులు, కాంట్రాక్టర్ తెలిపారు. రెండు రోజుల్లో రాకపోకలకు వీలుగా వంతెనను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తామన్నారు. అలాగే గొర్లె సీతారామపురం, పారాది మధ్యలో రహదారి మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



వంతెనను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైవీ సుబ్బారెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెరుమాళి, టెక్కలివలస గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడపకు ఎమ్మెల్యే వెళ్లి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ఊసే లేదని, జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని గుర్తుచేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో అమలు చేసి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసుకున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలన్నీ మళ్లీ ఎప్పటిలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని, సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం ఎంపీపీ ప్రతినిధులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, సర్పంచ్ హేమలత, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, తహసీల్దార్ రత్నకుమార్, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెరుమాళిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన

తెర్లాం: తెర్లాంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహార పదార్థాలతో పాటు, ఆకుకూరలు, కాయకూరలతో చేసిన వివిధ రకాల వంటలను ప్రదర్శనలో పెట్టారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు వివరించారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ డి.రత్నకుమార్, హెచ్‌డీటీ భాస్కరరావు, సర్పంచ్ బోనెల రూప, తదితరులు పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు.



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

చెత్త సేకరణపై అవగాహన

రాజాం సిటీ: గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి సోపేరు గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడిపొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలని, అక్కడ తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు తయారీకి వినియోగించాలని సూచించారు. ఇలా తయారుచేసిన ఎరువును పంటలకు వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.



సోపేరులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

వంగర: మండల కేంద్రం వంగరలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో యుద్ధ ప్రాతిపదికన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇటీవల యార్డులో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో హుటాహుటీగా టీఆర్ఈ, ప్రొటెక్షన్ విభాగాలకు చెందిన అధికారుల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో ఈఈ ఫణికుమార్, డీఈఈలు బి.ఫణీంద్ర కుమార్, ఎల్.సత్యనారాయణ, ప్రసాదరావు, ఏఈ కె.వినయ్‌కుమార్, ఎల్ఐలు, జేఎల్ఎంలు, లైన్‌మేన్లు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రాన్స్‌కో అధికారులు

వైద్య శిబిరాల్లో ప్రజలకు సహకరించాలి

రాజాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు కోరారు. మండలంలోని సోపేరు, గార్రాజుచీపురుపల్లి గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో శుక్రవారం సమావేశమై పలు సూచనలు చేశారు. శిబిరాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వైద్య శిబిరాలపై ప్రజలకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. కౌంటర్ల వద్దకు ప్రజలను తీసుకెళ్లి, వారిని అవసరమైన వైద్య సేవలందేలా చూడాలని వలంటీర్లకు ఆదేశించారు. అనంతరం వైద్యసిబ్బంది పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి వావిలపల్లి శ్రీనివాసరావు, ఆయా పంచాయతీల కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు